# 39వ పుష్పము

39. ఓం శ్రీ సాయి - అనాథనాథాయ నమః

1) నామ పారాయణ ప్రియుడు

"దిక్కులేని వారికి దేవుడే దిక్కు" అంటారు. నాథుడు అంటే ప్రభువు. ఆలనా పాలనా చూచే దిక్కు లేనివారు అనాథలు. అట్టివారికి శ్రీ స్వామియే సంరక్షకుడు. ఒక భక్తుడు 8 రోజులు పక్షవాతము నుండి బాధపడుటచే ఆ వ్యాధిని తాను స్వీకరించి, తాను బాధపడి, ఆ భక్తుని రక్షించాడు. రోగులు, వికలాంగులు, కుష్టురోగులు, నిరక్షరకుక్షులు అంటే స్వామికి అసహ్యము లేదు. అట్లనే నీవు అసహ్యించుకొనకుము. వారిని అసహ్యించుకుంటే సాయిని అసహ్యించుకొన్నట్లే అంటారు స్వామి. శ్రీ సాయిని అందరిలో చూడు, అందరిపట్ల ప్రేమ, గౌరవములు చూపు అంటారు స్వామి. ఫల స్వరూపమేమంటే, అనాధ నాధులంటూ ఎవరు లేరు. అందరిని లాలించే, పాలించే దిక్కు శ్రీ సత్యసాయి. కనుక అట్టి అనాధ నాధునికి నమస్కారము.

2) కవీశ్వరుడైన వాణీస్వరూపుడు

పు॥ కామ శక్తియే అధిక మీ కాలమందు
వాని మిత్రుడు క్రోధుడు వారిరువురు
చేర్చుకొనునట్టి జనునకు చేటు కల్గు
సత్యమును చూపు బాట యీ సాయి మాట ॥

దివ్య ప్రకటన (Cont.) : చిన్న చిన్న జబ్బుల చికిత్సకోసం, ఉద్యోగ ప్రమోషన్లకోసం, ప్రాపంచిక సంతోషాల కోసం, సుఖకరమైన వస్తువులకోసం మీరు నా వద్దకు వస్తున్నారు. అని చెత్త, చెదారము నేనెందుకు వచ్చానో దానికోసం చాలా కొద్దిమంది మాత్రమే వస్తున్నారు. ఆ కొద్దిమంది కూడా సాధన మార్గం అనుసరించే వారే. ఆధ్యాత్మిక జ్ఞానం పొందటానికి వస్తారు. అట్టి వారిని వేళ్లమీద లెఖ్కపెట్ట వచ్చును. నేను మోక్షం యివ్వటానికే వచ్చాను. మీ ప్రాపంచిక తెలివితేటలతో భగవంతుని తెలుసుకోలేరు. లౌకిక జ్ఞానానికి అందేవాడు కాదు భగవంతుడు. మీరు కొంత భారం పొందవచ్చును. కాని దేవుని గూర్చి మీరు ఏమియు చెప్పలేదు. మీదంతా ఊహాగానాలే. మీ మాటలన్నీ మీ అజ్ఞానాన్ని కప్పిపుచ్చే వట్టి బూటకపు మాటలే అవుతాయి.

ప్రతిరోజు ఏదో ఒక మంచి పని చేయండి. అది వున్నత జీవితానికి తీసుకుపోతుంది. నీ వద్ద ఎక్కువ సోదరత్వం వుందని నిరూపించు. నీవు మధురమైన మాటలు పలుకు. ఇంద్రియ నిగ్రహం చూపించు. జయాపజయాలను శాంతంగా తీసికో. నాకు మూడు కాలముల సంగతి తెలుసు. మీ అందరి జాతకాలు నాకు పూర్తిగా తెలుసు. అందుకే నేను మీ తప్పలను క్షమించను. నాకు మీ పుట్టుపూర్వోత్తరాలు పూర్తిగా తెలుసు. అందుచే నా అభిప్రాయాలు వేరుగా వుంటాయి.

3) సకల తత్త్వబోధకుడు - ఆత్మతత్త్వము - ఆచరణ

ఆత్మతత్త్వం నిజంగా వస్తువులను ప్రకాశింపచేసేది కాని, దానిని ప్రకాశింప చేయడానికి మరియొక చైతన్యం లేదు. ఇది సమస్తమునకు ద్రష్ట రూపము ధరిస్తుంది. ఆత్మతత్త్వమునకు మార్పులు ఉండవు. అది చైతన్యము. ఆత్మకు చావు, పుట్టుకలు, పరిణామ క్షీణములు, అభివృద్ధి, అసంతృప్తులు వుండవు.

4) జ్ఞాన స్వరూపుడు - బృహదారణ్యోపనిషత్తు (3-7-28)

ఉ॥మం॥ యోరేతసి తిష్ఠన్రేత సో అన్తరోయగ్ రేతో న వేద । యస్య
రేతశ్శరీరం యోరేతోన్తరోయ మయత్యేషత ఆత్మాన్తరా
మ్యమృతోదృష్టో ద్రష్టాశ్రుతః, శ్రోతామతా మన్తాః,
విజ్ఞాతో విజ్ఞాతా నాన్యోతోస్తి, ద్రష్టా, నాన్యోతోస్తి

శ్రోతా, నాన్యోతోస్తి, మన్తానాన్యోతోస్తి విజ్ఞాతైషత,
ఆత్మాన్తర్యామమృతోతోతోన్యదార్తం తతో హోద్ధాలక అరుణి
రుపురరామ ॥

తా॥ "ఆధ్యాత్మ స్వరూపములగు ప్రాణ వాక్చక్షుస్సులు, మొదలైన వాటియందున్నదై, వాని వలన తెలిసికొనబడక అవియే దేహముగా గలిగి, వాటిని నియమించుచు నాశరహితమైన అంతర్యామి స్వరూపమగు ఆత్మ, చూపునకును, వినికిడికిని, తలంపునకును, బుద్ధి జ్ఞానములకును, గోచరము కానిదై ఆ చక్షురాదింద్రియములకు సమీపమునైనదగుటవలన, చూచునదియు, వినునదియు, తలంచునదియు, తెలిసికొనునదియును అగుచున్నది. ఇట్లు సమస్తమునకు ద్రష్టమై దేనిచేతను చూడబడక, సర్వాంతరమై, అంతర్యామి స్వరూపమునగు పరమాత్మ కంటె అన్యమగు ద్రష్టయు, శ్రోతయు, మంతయు, విజ్ఞాతమును, ఏ కారణమున లేదో, ఆ కారణము వలన నాశరహితమును సమస్తములైన సంసారుల యొక్క కర్మ ఫలములను విభాగించు నట్టియును, సమస్త సంసార ధర్మము లేనిది యగు యీ ఆత్మయే. ఇదే నీ యొక్క నాశరహితమగు అంతర్యామి స్వరూపము. ఇట్టి అంతర్యామి స్వరూపమగు పరమాత్మ కంటే వేరైనది అంతయు నశించునదియే" అని యాజ్ఞవల్క్యుడు అరుణ పుత్రుడైన ఉద్దాలకునికి చెప్పెను.

ఉ॥మం॥ అస్తమితి ఆదిత్యే... విపల్యేతీతి ॥ (బృ.ఉ. 4-3-6)

తా॥ ఓ యాజ్ఞవల్క్యుడా! ప్రాకృత పురుషుడగు, కరచరణాది అవయవములు గల, యీ పురుషుడు సూర్య, చంద్ర, అగ్ని, వాక్కులు లేని సమయమున ఏ తేజస్సు గలవాడగుచున్నాడని జనకుడు ప్రశ్న వేసెను. ఓ జనకుడా! ఈ ప్రాకృత పురుషుడు ఆత్మ తేజస్సు చేతనే కూర్చుంటున్నాడు. క్షేత్ర, అరణ్యాదుల గూర్చి పోవుచున్నాడు. గనుక ఈ పురుషునికి సూర్య, చంద్ర, అగ్ని వాక్కులు లేనప్పడు ఆత్మ తేజస్సుయే గలవాడగుచున్నాడని యాజ్ఞవల్క్యుడు చెప్పెను.

ఉ॥మం॥ తమేవ భాంత... సర్వం విభాతి ॥ (ముం.ఉ. 2-2-10)

తా॥ సూర్య చంద్రాది రూపమున వెలుగుచున్న యీ ప్రపంచమంతయు, స్వయం జ్యోతియు, సర్వదా ప్రకాశించువాడును అయిన పరమాత్మ యొక్క ప్రకాశము ననుసరించియే ప్రకాశించుచున్నది.

బ్ర॥సూ॥ ఈ స్వయంజ్యోతి విషయము, బ్రహ్మసూత్ర భాష్యములో శ్రీ శంకరులు బాగుగా చర్చించినారు. "జతిరధి కరణములో"

ఉ॥మం॥ తం దేవా జ్యోతిషా జ్యోతి రాయిరు రుపాసతేమృతం ॥

తా॥ ఆ బ్రహ్మము సూర్యాది జ్యోతిస్సులకు, జ్యోతిస్సు.

ఉ॥మం॥ "తేజ సేద్ధః" ॥ (తై.ఉ.)

ఈ బ్రహ్మము దివ్య తేజస్సుచేతనే అంతయు ప్రకాశించుచున్నది.

5) ప్రేమ స్వరూపుడు - అహంకారము

"అహంకారము మనస్సును వికలం చేస్తుంది. అంతః విచారణ లేకుండా చేస్తుంది. సాధకుడు తన సాధనలో జయం పొందాలంటే, తాను చేసిన తప్పలు చెప్పేవారికి కృతజ్ఞుడై యుండాలి. ఉపయోగకరములైన వ్యాఖ్యానాలు, సలహాలు, సూచనలు ఎక్కడ నుండి వచ్చినా స్వీకరించాలి. అహంకారం తగ్గించుకోడానికి యిదే దారి".

దివ్యలీల : శ్రీ దక్షిణామూర్తి ఢిల్లీ ప్రభుత్వంలో గొప్ప ఉద్యోగి. తనకు ఏ సమస్య వచ్చినా స్వామిని ప్రార్థించేవాడు. స్వామి దర్శనమిచ్చే వారు. వెంటనే సమాధానము దొరికేది. ఒకసారి అంకారా ప్రపంచ అణుబాంబు ఏజన్సీ సభకు వెళ్లాడు. అతడు మితభాషి. సభలో మాట్లాడమన్నారు. స్వామిని ప్రార్థించాడు, నుంచున్నాడు. స్వామి అభయ హస్తం కనబడింది. ఉపన్యాసమిచ్చారు. అది అద్భుతమైన ఉపన్యాసంగా మారింది.

దివ్య చికిత్స : మిలటరీలో పని చేస్తున్నాడు శ్రీ అయ్యరు. కడుపులో చెప్పలేని బాధ. స్వామి విభూతి సృష్టించి యిచ్చి, దాన్ని సేవించమన్నారు. నొప్పి తగ్గింది. అతనికి సంతానం లేదు, చక్కని కుమారుడు కలుగుతాడు అని స్వామి చెప్పగా అట్లే జరిగింది.

6) సర్వజన ప్రియుడు - నీరుగా మారిన మద్యం (ఒక పాశ్చాత్య భక్తుడు)

నేను త్రాగుబోతును. నేను, నా భార్య ప్రశాంతి నిలయానికి వచ్చాము. ఏసుక్రీస్తు 2000 సం॥ల క్రింద మహత్యాలు చేసారట. ఇప్పుడు బాబా చేస్తున్నారట. బ్రాంది 2 సీసాలు అర్ధరాత్రి వరకు త్రాగాను. స్వామి ఫొటో ఎదురుగా వుంది. భార్య వారించినా, మళ్ళీ త్రాగటం ప్రారంభించాను. అంతా పూర్తి అయింది. నేను త్రాగింది బ్రాందియా? లేక నీళ్ళా? మత్తురాలేదు. నీళ్ళే అని తేలింది. తెల్లవారింది, నేను మా ఆవిడ భజన సమావేశానికి వెళ్ళాము. బాబా మెల్లగా నేను కూర్చున్న చోటికి వచ్చారు. బాబా నా ముందు నిలుచుని, విస్కీ త్రాగిన వాని నటన చేసి చూపారు. నాకు చాలా అవమానం వేసింది. తల తీసివేసినట్లయినది. ఇది పుణ్యక్షేత్రం, త్రాగవద్దని భార్య బ్రతిమాలినా, ఆమె మాట వినక త్రాగాను. బాబా అట్లా నటిస్తుంటే నాకు తల కొట్టివేసినట్లయింది. ఏం చేస్తాను, రెండు చేతులు జోడించి నమస్కారము చేశాను, నిశ్చేష్టుడైనాను. మేము మా దేశానికి వెళ్ళిపోయాము. అప్పటినుంచి త్రాగితే ఒట్టు. స్వామి నాలో చేసిన పరివర్తన అదే. స్వామికి ఎంత ఋణపడి యున్నానో చెప్పలేను.

7) స్తుతి ప్రియుడు :

దివ్యభజన: గోపాల । రాధేకృష్ణ । గోవింద । గోవింద గోపా ॥గో॥
గోపా । గోపా । గోపా ॥ ॥గో॥
గోవింద । గోవింద । గోపాల । రాధేకృష్ణ ॥
గోవింద । గోవింద । గోపా ॥ (శాయి) ॥గో॥

మృత్యువునుంచి జన్మవరకు, అనారోగ్యం నుంచి ఆరోగ్యమునకు యీ ప్రపంచంలో అనుభవాలు చూస్తున్నాము. మానవ జీవితంలో, యీ ప్రపంచం చాలా ముఖ్యమైనది. శిశువు బాధలోనుంచే బయటపడుతుంది. ఈ బాధలు కొంతవరకు మంచివే. ఈ బాధలు, క్రొత్త శిశువు వచ్చింది అనే దాన్ని తెలియజేస్తాయి. అశాంతి నుంచి ప్రశాంతి, ప్రశాంతి నుంచి ప్రకాంతి, ప్రకాంతి నుండి పరంజ్యోతి వస్తూ వుంటాయి. ఇవి రాత్రి, పగలులాగ తిరుగుతూ వుంటాయి. సంతోషం, దుఃఖం ఇవి కవల అక్క చెల్లెండ్రు. ఈ రెండు ముఖ్యమే. కావాలి. నూతన జీవితాన్ని యిస్తాయి. అవి చలికాలం, వేసంగిలు లాగా వుంటాయి. కొందరు అంటరు "బాబా! యీ వేగం తగ్గించు' వేసంగి వేడితోనే భూమి శక్తిని తీసుకుంటుంది. అదియే సూర్య తేజస్సు. వానాకాలము వచ్చేటప్పటికి ధాన్యాన్ని అధికంగా యిస్తుంది".

8) వేదాంతవేద్యుడు - యాజ్ఞవల్క్యోపనిషత్

ఉ॥మం॥ ప్రణమేత్కంతదాత్మజ్ఞో । న కార్యం కర్మణా తదా ।
ఈశ్వరో జీవలయా । ప్రవిష్టో భగవానితి ।
ప్రణమే దండలీమా । హశ్వ ఛండాల గోఖరాన్ ॥

తా॥ ఆత్మజ్ఞాని ఎప్పడు ఎవరికి నమస్కరింపవలయును? అప్పడతనికి కర్మవలన నగు నే దేహ మున్నది? ఏదియును లేదు. భగవంతుడైన ఈశ్వరుడు తన యంశము చేతనే జీవుడుగా ప్రవేశించి యున్నాడని, కుక్క, ఛండాలుడు, గోవు, గాడిద వీటియందు భేద బుద్ధిని విడచి, భూమి మీద చెట్టువలె పడి నమస్కరింపవలయును.

ఆత్మబోధ శ్రీ శంకర కృతము - 34

శ్లో॥ నిర్గుణో నిష్క్రియో నిత్యో । నిర్వికల్పో నిరంజనః ।

నిర్వికారో నిరాకారో । నిత్యముక్తోస్మి నిర్మలః ॥

తా॥ నేను గుణ శూన్యుడను (బుద్ధి లేకపోవుట వలన). నేను క్రియా శూన్యుడను (ఇంద్రియములు లేక పోవుట వలన). నేను నిత్యుడను, ఎల్లప్పడు ఉండువాడను (అవస్థాత్రయమందు నశింపనందున), సంకల్ప రహితుడను (మనస్సు లేకపోవుట వలన), ఎక్కడ, ఎడతెగని స్వరూపము గలవాడను (ఒక దాని యందు సంబంధింపనందున), ఆకారము లేనివాడను (షోడశ కళా పరిపూర్ణ లింగ దేహము లేనందున), ఎల్లప్పడు ముక్తి స్వరూపుడను (ఒక సంబంధమును నాయందు లేనందున) రాగాది రూప మాలిన్యము లేనివాడను (అవిద్యా రూపమైన అంతఃకరణ వృత్తి శూన్యుడను గనుక).

ఓం తత్సత్